కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ సోమవారం 10 ఫిబ్రవరి 2025
సంపుటి: 14, సంచిక: 312 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

## బస్సును ఢీకొట్టిన ట్రక్కు

41 మంది దుర్మరణం



2



2

రేపటి మన్యం బంద్‌కు

## సీపీఎం మద్దతు

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు

# బీఆర్ఎస్ మద్దతు!

**కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకే బీఆర్ఎస్ పోటీ నుండి విరమణ**

- బీసీ జాబితాలోకి ముస్లింలను కలిపేందుకు కుట్ర
- మీ అయ్య జాగీరు అనుకుంటున్నారా..?
- ముస్లిం హిందువులు వేరువేరు జాతులు
- కాంగ్రెస్ ప్రభుత్వం మూరత్వపు విధానం
- నోరు మూసుకుని కూర్చున్న బీసీ సంఘాలు
- ఒవైసీ రేవంత్, బీసీలను దెబ్బతీయాలని కుట్రలు
- నల్గొండలో కేంద్రమంత్రి బండి సంచలన వ్యాఖ్యలు



**నల్లగొండ ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** బీసీ జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారు. మీ జాతి ఏందన్నా, మీ అయ్య జాగీరనుకుంటున్నారా మేం బొట్టు పెట్టుకుంటాం. మాకు జన్మ నక్షత్రం ఉంటుంది. గోత్ర నామాలుంటాయి. మొలదారం కట్టుకుంటాం. ఇది మా జాతి. ఒక జాతికి, ఇంకో జాతికి తేడా తెలుసుకోలేని మూరత్వపు పార్టీ కాంగ్రెస్. అసలు హిందువులకు, ముస్లింలకు పోలికేమిటి. హిందువులు అడుక్కోవాలా బిచ్చగాళ్లను చేద్దామనుకుంటున్నారా అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అసలు బీసీ సంఘాలు ఏం చేస్తున్నాయి, ఎవరు అధికారంలో ఉంటే వాళ్లకు వత్తాసు పలుకుతారా అంటూ మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేస్తారు? వారి ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. జీహెచ్ఎంసీ ..మిగతా 2లో



### దక్షిణాది రాష్ట్రాలు...

# చేతులు కలపాలి

**తెలంగాణ రైజింగ్ అనేది నినాదం మాత్రమే కాదు**

**అది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నం**

**ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ నిర్మాణం**

**మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్**

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**తిరువనంతపురం ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూసే పేదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ శుభవార్త చెప్పారు. ఆదివారం కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు చేతులు కలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ అనేది నినాదం మాత్రమే కాదని.. అది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల స్వప్నమని వెల్లడించారు. తెలంగాణను భారత దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ ..మిగతా 2లో

# తెలంగాణలో తొలి జీబీఎస్ రోగి మృతి

**ఈ వ్యాధిని మొదటగా మహారాష్ట్రలో గుర్తించారు**




హైదరాబాద్ ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్) ప్రస్తుతం దేశంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు జీబీఎస్ (గులియన్ బారీ సిండ్రోమ్). ఇది ఒక నరాల వ్యాధి. ఈ వ్యాధిని మొదటగా మహారాష్ట్రలో గుర్తించారు. ఈ వ్యాధితో తెలంగాణలో తొలి మరణం సంభవించింది. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ సిద్దిపేటకు చెందిన ఓ వివాహిత మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, సిద్దిపేట జిల్లా సిద్దిపేట గ్రామీణ మండలం సీతారాంపల్లికి చెందిన వివాహిత (25)కు ఐదేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమెకు ఇటీవల కుమార్తె జన్మించింది. కుమార్తె జన్మించిన తర్వాత నెల రోజుల ..మిగతా 2లో

### ఢిల్లీ పెద్దలను కలిసిన వెంటనే...

# మణిపూర్ సీఎం రాజీనామా



**ఈ సెషన్‌లో బీరెన్ సింగ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని కాంగ్రెస్ ప్రకటన**

**మణిపూర్ ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్)** మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. ఇంఫాల్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు ఆయన తన రాజీనామా లేఖను సమర్పించారు. ఆయన వెంట బీజేపీ, ఎన్‌పీఎఫ్ పార్టీలకు చెందిన 14 మంది ఎమ్మెల్యేలు, మణిపూర్ రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎ.శారద, పార్టీ సీనియర్ నేత సంబిత్ పాత్ర ఉన్నారు. ఫిబ్రవరి 10 నుంచి మణిపూర్ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ ..మిగతా 2లో



### ఫిరాయింపుల కేసు

# నేడు సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ సోమవారం సుప్రీం కోర్టులో విచారణకు రానుంది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇంతకు ముందు ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ..మిగతా 2లో

### ఎన్‌కౌంటర్‌లో...

# 31 మంది మావోల హతం

**20 మంది పురుషులు..**

**11 మహిళలు**

**ఇద్దరు డీఆర్ జి జవాన్ల మృతి**

**మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు**

**భారీ సంఖ్యలో ఆయుధాలు స్వాదీనం**

**జవాన్లను అభినందించిన విష్ణుదేవ్ సాయి**



**చింతూరు ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని బిజాపూర్ -నారాయణ్ పూర్ సరిహద్దుల్లోని గ్రీన్ పార్క్ అడవుల్లో మావోయిస్టులు సమావేశం అయ్యారని తెలుసుకున్న సి ఆర్ పి యఫ్ ,బస్టర్ ఫైటర్,స్ డి ఆర్ జి, సి ఆర్ పి యఫ్, బలాగాలు ఆదివారం ఉదయం నుండి గాలింపు చర్యలు చేపట్టారు. తోలుత 12 మావోయిస్టులు మృతి చెందారిని, ఆ తర్వాత ..మిగతా 2లో



### తిరుమల కల్తీ నెయ్యి కేసులో

# నలుగురి అరెస్ట్!

**తిరుమల ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై సీబీఐ చేపట్టిన విచారణలో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం.. నెయ్యి సరఫరా చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. తమిళనాడకు చెందిన ఏఆర్ డెయిరీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పరాగ్ డెయిరీ, ప్రిమీయర్ అగ్రి ఫుడ్స్, ఆల్ఫా మిల్క్ ఫుడ్స్ సంస్థలకు సంబంధించిన కీలక వ్యక్తులను మూడు రోజులుగా ..మిగతా 2లో

### సీఎం పదవికి

# ఆతిశీ రాజీనామా



**ప్రధాని విదేశీ పర్యటనల తరువాతనే ముఖ్యమంత్రి అభ్యర్థిపై క్లారిటీ..!**

2

### ఢిల్లీ ముఖ్యమంత్రి రేసులో

# పర్వేశ్ సింగ్?



న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్): మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేజ్రీవాల్‌నే ఓడించిన బీజేపీ నేత పర్వేశ్ సింగ్ పేరు ప్రస్తుతం ఢిల్లీ రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. తదుపరి ముఖ్యమంత్రి రేసులో ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఒకసారి ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ఎన్నికైన పర్వేశ్ రాజకీయ, కుటుంబ నేపథ్యం ఏమిటో ..మిగతా 2లో

## పల్నాడు జిల్లాలో
# ఘోర ప్రమాదం

**ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు మహిళలు మృతి**

**ముప్పాళ్ల, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** పల్నాడు జిల్లాలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముప్పాళ్ల మండలంలోని బొల్లవరం పరిధిలోని మాదల మేజర్ కాలవ కట్టపై ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు మహిళా కూలీలు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ముప్పాళ్ల మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన మహిళా కూలీలు మిరప కోతలకు వెళ్లి తిరిగి గ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది ట్రాక్టర్ బోల్తా పడటంతో మధిర సామ్రాజ్యం (50) మధిర గంగమ్మ (55 ), చక్కెర మాధవి( 30) తేనెపల్లి పద్మావతి (45 )అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాక్టర్ ప్రమాద ఘటనపై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మహిళా కూలీల మృతి బాధాకరమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలందించాలని అధికారులను ఆదేశించారు.

## సీఎం పదవికి ఆతిశీ రాజీనామా

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** న్యూఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆతిశీ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన ఆతిశీ, తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్ ఢిల్లీ శాసనసభను రద్దు చేశారు. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇంటికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వెళ్లారు. ఢిల్లీ సీఎం విషయంపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. శనివారం వెలువడిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార ఆమ్ ఆద్మీని బీజేపీ ఓడించింది. ఈ నేపథ్యంలో సీఎం పదవికి ఆతిశీ రాజీనామా చేశారు. ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో జైలు శిక్ష అనుభవించి గతేడాది సెప్టెంబర్‌లో బయటకు వచ్చాక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రజలు మళ్లీ తనను మళ్లీ గెలిపించే వరకూ పదవిలో ఉండను అంటూ సీఎంగా ఆతిశీని ప్రతిపాదించారు. దీంతో ఆమె అనూహ్యంగా ఆతిశీ సీఎం పదవిని చేపట్టారు. ఈ ఎన్నికల్లో ఆప్ అధినేత కేజ్రీవాల్ సహా అగ్రనేతలు మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్ ఓటమి పాలయ్యారు. ముఖ్యమంత్రి ఆతిశీ మాత్రం కాల్‌కాజీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఒకదశలో వెనుకంజలో ఉన్న ఆమె ఆ తర్వాత పుంజుకుని బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారు.

**ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారం అప్పుడే**

ఇక ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ, సీఎం అభ్యర్థిగా ఎవరని నిర్ణయిస్తుందా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఢిల్లీ సీఎం రేసులో మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఆ తర్వాత బీజేపీ మాజీ అధ్యక్షులైన విజేందర్ గుప్తా, సతీశ్ ఉపాధ్యాయ్, ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ, జాతీయ కార్యదర్శి దుష్యంత్ గౌతమ్‌తో పాటు బీజేపీ ఎంపీ బన్సూరీ స్వరాజ్ పేర్లు ముఖ్యమంత్రి రేసులో ఉన్నాయి. అయితే, పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. మరోవైపు ప్రధాని మోదీ ఈ నెల 10 నుంచి ఫ్రాన్స్, అమెరికా పర్యటనలకు వెళ్లనున్నారు. ఆయన తిరిగి వచ్చాకనే ప్రమాణ స్వీకారం ఉంటుందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.


## రేపటి మన్యం బంద్‌కు సిపిఎం మద్దతు

**చింతూరు ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** రాజ్యాంగబద్ధ పదవిలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గా ఉన్న అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివాసి గిరిజన సంఘాలు ఈ నెల 11,12 తేదీలలో 48 గంటల రాష్ట్ర ఏజెన్సీ బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చాయి. ఈ బంద్ కు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ,బంద్ జయప్రదంలో భాగస్వామ్యం అవుతాం అని సిపిఎం మండల కమిటీ ప్రకటించింది. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి జీవో నెంబర్ 3 ని పునరుద్ధరిస్తామని చెప్పి ఎన్నికల్లో హామీ ఇచ్చారని నేటికీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు అవుతున్న ఆ హామీ అమలుకు ఇంతవరకు పూనుకోలేదని అన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయకుండా, ఉన్న చట్టాలను ఎలా సవరించాలని ఆలోచించడం అత్యంత దుర్మార్గమని అన్నారు.ఎన్నికల ప్రచారంలో గిరిజన ప్రాంత జీవోలను చట్టాలను అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు టూరిస్ట్ డెవలప్మెంట్ కోసం గిరిజనుల భూములకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని సవరించాలని ప్రకటించడం దుర్మార్గమని అన్నారు. ఇది ఆదివాసి ప్రాంత హక్కులు చట్టాలకు భంగం కలిగించడమేనని ఆరోపించారు. అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమా దానిమీద ప్రభుత్వం వైఖరి స్పష్టంగా తెలియచాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వనరులను పెట్టుబడిదారులకు ఆదాయాలుగా మలిచి ఏజెన్సీ ప్రాంతానికి, ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రభుత్వ విధానాలపై ఆదివాసిలంతా ఐక్యంగా తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై ప్రకటన చేయాలని, ఆదివాసీల హక్కులు చట్టాలను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాల రక్షణ కోసం, స్పీకర్ వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 11,12న జరిగే 48 గంటల మన్యం బందుకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ, బంద్ జయప్రదంలో భాగస్వామి అవుతామని ప్రకటించింది. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సీసం సురేష్,ఎర్రంశెట్టి శ్రీనివాస్, ముట్టం రాజయ్య, పోడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ, మడకం చిన్నయ్య,సవలం కన్నయ్య, చింతా రాంబాబు, పట్రా రమేష్, కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మద్దతు!

మొదటి పేజీ తరువాయి...

ఎన్నికల్లో బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి హిందువులకు అన్యాయం చేసినప్పుడు హిందుత్వ వాదులు, బీసీ సంఘాలు స్పందించకపోవడంవల్లే ఈరోజు ఒవైసీ, రేవంత్ గ్యాంగ్ కలిసి బీసీలను దెబ్బతీయాలని ముస్లింలను బీసీ జాబితాలో కలిపే కుట్రకు తెరదీశాయన్నారు. అగ్రకులాల ప్రజలు కూడా బీసీలకు జరిగిన అన్యాయంపై సానుభూతి తెలుపుతుంటే, బీసీ సంఘాలు ఎందుకు నోరు మూసుకున్నాయని మండిపడ్డారు. బీసీలతోపాటు హిందువులంతా ఏకమై కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారం చెలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నేతలను హామీలెందుకు అమలు చేయలేదో నిలదీస్తూ గల్లాపట్టి అడగాలని పట్టభద్రులు, టీచర్లకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈరోజు నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ జిల్లా




కార్యాలయంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల కార్యశాలలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపైన, బీసీ సంఘాల తీరుపైన నిప్పులు చెరిగారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సరైన అభ్యర్థులే కరువయ్యారు. దేశ చరిత్రలో అధికార పార్టీకి మంచి అభ్యర్థులు కరువైపోవడం విచిత్రంగా ఉంది. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటైనయ్. ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరింది. కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ సహా పలు అవినీతి కేసుల్లో ఇరుక్కుపోయిన బీఆర్ఎస్ నేతలు అరెస్ట్ కాకుండా రక్షించేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని, అందుకు ప్రతిఫలంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్ ను గెలిపించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తోంది. రెండు పార్టీలు కలిసి బీజేపీని గెలవనీయకూడదని కుట్ర పన్నాయి. రెండు పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని బండి సంజయ్ ప్రశ్నించారు.

## ఢిల్లీ పెద్దలను కలిసిన వెంటనే...
# మణిపుర్ సీఎం రాజీనామా

మొదటి పేజీ తరువాయి...

సెషన్‌లో బీరెన్ సింగ్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం (ఫిబ్రవరి 7న) ప్రకటించింది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు శనివారం అధికార ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యేలతో బీరేన్ సింగ్ ముఖ్యమంత్రి సచివాలయంలో భేటీ అయ్యారు. బీజేపీ పెద్దల నుంచి పిలుపు రావడం వల్ల ఆదివారం ఉదయం బీరేన్ సింగ్ హుటాహుటిన దిల్లీకి వెళ్లారు. అక్కడ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. దిల్లీ నుంచి ఇంఫాల్‌కు తిరిగి వచ్చిన వెంటనే బీరేన్ సింగ్ నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు రాజీనామా లేఖను అందించారు. మణిపుర్ అసెంబ్లీ సెషన్‌కు సరిగ్గా ఒకరోజు ముందు ఈ పరిణామం జరగడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

బీరెన్ సింగ్ తన రాజీనామా లేఖలో కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇన్నేళ్ల పాటు మణిపుర్ ప్రజలకు సేవ చేసినందుకు గర్విస్తున్నట్లు చెప్పారు. తనకు ఈ గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు కేంద్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. మణిపుర్ అభివృద్ధి కోసం తన హయాంలో చేపట్టిన ప్రాజెక్టులకు కేంద్ర సర్కారు నుంచి పూర్తి సహకారం లభించిందన్నారు.ఫిబ్రవరి 10 నుంచి జరగనున్న మణిపుర్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలన్నీ లేవనెత్తుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన నేపథ్యంలో బీజేపీ హైకమాండ్ రంగంలోకి దిగి మణిపుర్‌లోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. ఈ క్రమంలోనే బీరెన్ సింగ్‌ను దిల్లీకి పిలిపించి, మణిపుర్ హింసాకాండతో ముడిపడిన పలు అంశాలపై ఆయనతో చర్చించింది. ఆ వెంటనే ఆయన ఇంఫాల్‌కు తిరిగొచ్చి రాజీనామా చేయడం గమనార్హం.

మణిపుర్‌లో దాదాపు రెండేళ్ల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మెయితీ, కుకీ తెగల మధ్య ఈ ఘర్షణలు జరిగాయి. 2023 సంవత్సరం మే 3న మొదలైన ఈ ఘర్షణల్లో ఎంతోమంది మాన, ప్రాణాలు నష్టం జరిగింది. దాదాపు 250 మందికిపైగా చనిపోయారు. 65వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు.

## ఫిరాయింపుల కేసు
# నేడు సుప్రీంలో విచారణ

మొదటి పేజీ తరువాయి...

ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కాలయాపన చేస్తున్నారంటూ కేటీఆర్ సుప్రీంకోర్టులో జనవరి 29వ తేదీన రిట్ దాఖలు చేశారు. స్పీకర్ వెంటనే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు. అయితే ఫిరాయింపులపై బీఆర్ఎ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణ నడుస్తోంది. ఈ క్రమంలో ఈ రెండు పిటిషన్లను కలిపి 10వ తేదీన విచారణ చేస్తామని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది.

బీఆర్ఎస్ పార్టీ మీద గెలిచిన ఎమ్మెల్యేలు శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్,అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి , సంజయ్ కుమార్‌లు కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించిన సంగతి తెలిసిందే. వీళ్లపై అనర్హత వేటు వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ గవాయ్, అగస్టిన్ జార్జ్ మసీహ్లతో కూడిన ధర్మాసనం ఆ పిటిషన్‌ను శుక్రవారం(జనవరి 31న) విచారణ జరిపింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని కిందటి ఏడాది మార్చి తెలంగాణ హైకోర్టు ఆదేశించిందని, అయితే కోర్టు ఆదేశాలను తెలంగాణ స్పీకర్ ధిక్కరించారని, కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదని పాడి కౌశిక్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే.. సంబంధిత ఎమ్మెల్యేలకు ఇప్పటికే స్పీకర్ నోటీసులు జారీ చేశారని అసెంబ్లీ సెక్రటరీ, తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. ఫిరాయింపుల వ్యవహారాల్లో స్పీకర్ తొందరపాటు నిర్ణయాలు సరికాదని గతంలో సుప్రీం కోర్టు చెప్పడాన్ని ఆయన బెంచ్ ముందు ప్రస్తావించారు. కాబట్టి, స్పీకర్ నిర్ణయానికి తగు సమయం కావాలని ఆయన కోరారు.అయితే ఇంకెంత కాలం ఎదురుచూస్తారని, మహారాష్ట్రలో లాగా ఎమ్మెల్యేల పదవికాలం అయ్యేదాకా ఎదురు చూస్తారా? అని సుప్రీం కోర్టు తెలంగాణ స్పీకర్‌పై వ్యక్తం చేసింది. దీంతో స్పీకర్ అడిగి చెప్తానని లాయర్ రోహత్గి చెప్పడంతో విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. రేపు (ఫిబ్రవరి 10న) కౌశిక్ రెడ్డి ఎస్ఎల్పీ, కేటీఆర్ రిట్ పిటిషన్‌లను కలిపి సుప్రీం కోర్టు విచారణ జరపనుంది.

## దక్షిణాది రాష్ట్రాలు...
# చేతులు కలపాలి

మొదటి పేజీ తరువాయి...


రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. 60 ఏళ్ల కలను నెరవేర్చినందున తెలంగాణ ప్రజలు సోనియా గాంధీని ఎంతగానో ప్రేమిస్తున్నారని అన్నారు. ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తే బీఆర్ఎస్ నేతలు నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ మాదిరి కాకుండా.. దానికి పూర్తి భిన్నంగా అభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. దేశంలోని ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై వంటి నగరాలతో కాకుండా ప్రపంచంలోని ముఖ్య నగరాలైన న్యూయార్క్, లండన్, సింగపూర్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ ఉండాలనుకుం టున్నామని తెలిపారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం.. ఇది భారతదేశం లోని పూర్తి హరిత, పరిశుభ్రమైన, అత్యుత్తమమైన నగరంగాఫ్యూచర్ సిటీలో మేం ఏ ఐ సిటీని నిర్మిస్తున్నాం. ఉండనుంది. ప్రపంచంలోని మరే నగరంతో పోల్చుకున్నా ఇది సరైన ప్రణాళిక, జోన్లు ఉన్న నగరంగా ఉండనుంది. అలాగే ఇది మొట్టమొదటి నెట్ జీరో సిటీ అని చెప్పుకొచ్చారు. అంతేకాదు, ఫ్యూచర్ సిటీలో మేం ఏ ఐ సిటీని నిర్మిస్తున్నాం. యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మిస్తున్నాం, హైదరాబాద్ పర్యావరణ సుస్థిరతకుగానూ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టినట్టు తెలిపారు. గ్రామాల్లోనూ అత్యుత్తమ వసతులు కల్పిస్తాం. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా ఇస్తున్నాం. రైతులకు ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నాం.. పంటలకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని అన్నారు. రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. ప్రతీ ఇంటికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఇస్తున్నామని అన్నారు. ప్రతీ సంవత్సరం నాలుగు లక్షల ఇళ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. 20 లక్షల పేద కుటుంబాలు సొంత ఇళ్ల కల నెరవేరుతుందని నేను హామీ ఇస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# తిరుమల కల్తీ నెయ్యి కేసులో నలుగురి అరెస్ట్!

మొదటి పేజీ తరువాయి...

తిరుపతిలో విచారిస్తోంది. విచారణకు సహకరించక పోవడంతో పాటు కల్తీ నెయ్యి ఘటనలో వారి ప్రమేయం ఉన్నట్టు ప్రాథమిక ఆధారాలు లభ్యం కావడంతో ఆదివారం అదుపులోకి తీసుకుంది. తిరుమల శ్రీవారి లడ్డు తయారీకి కల్తీ నెయ్యి వినియోగంపై సీబీఐ నేతృత్వంలో సాగుతున్న దర్యాప్తు కీలకదశకు చేరింది. శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతు కళేబరాల అవశేషాలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మారిన వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ కోరుతూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ నేతృత్వంలో పూర్తిస్థాయి విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటైంది. సీబీఐ హైదరాబాద్ డివిజన్ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, విశాఖ సీబీఐ ఎస్పీ మురళీరాంబతో పాటు రాష్ట్రం నుంచి విశాఖ డీఐజీ గోపినాథ్ జెట్టి, గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి సత్యకుమార్ పాండా ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది.గతేడాది నవంబర్‌లో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం పలు దఫాలుగా విచారణ నిర్వహించింది. ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం సభ్యులు తిరుమల, తిరుపతితో పాటు నెయ్యి సరఫరా చేసిన తమిళనాడులోని దుండిగల్ ప్రాంతంలో ఉన్న ఏఆర్ డైయిరీలో విచారణ నిర్వహించారు. మూడు రోజులుగా దర్యాప్తు బృందం సభ్యుడు సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు తిరుపతిలో మకాం వేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు. నెయ్యి సరఫరాకు తితిదేతో ఒప్పందం చేసుకున్న ఏఆర్ డైయిరీ పలు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఉత్పత్తి సామర్థ్యానికి మించి ఎక్కువ మొత్తంలో సరఫరా చేయడానికి ఉత్తరాదికి చెందిన పలు డైయిరీ సంస్థల నుంచి నెయ్యి కొనుగోలు చేసినట్లు గుర్తించిన సీబీఐ బృందం ఏ ఆర్ డైయిరీకి సహకరించిన సంస్థల ప్రతినిధులను అదుపులోకి తీసుకుని విచారించింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, పరాగ్ డైయిరీ, ఆల్ఫా మిల్క్ ఫుడ్స్, ఏఆర్ డైయిరీకి%ు% సంబంధించిన విపిన్ గుప్త, పోమిల్ జైన్, అపూర్వ చావడ, రాజశేఖర్‌లను తాజాగా అదుపులోకి తీసుకుంది. సోమవారం వీరిని కోర్టులో హాజరుపరిచే అవకాశముంది.





## ఎన్‌కౌంటర్‌లో...
# 31 మంది మావోల హతం

మొదటి పేజీ తరువాయి...

సాయంత్రానికి మృతుల సంఖ్య 31 చేరుకుంది. ఈ సంఖ్య ఇంకా పెరిగే సూచనలున్నట్లు తెలిసింది. వారి వద్ద వున్న ఆయుధాలు ఏ కె 47,యస్ యల్ ఆర్ లు, బర్మర్లు, మరి కొన్నిఆయుధాలు స్వాదీనం చేసుకున్నారు. కొంతమంది మావోయిస్టులకు గాయలైనట్లు సమాచారం. గాయలైన మావోయిస్టులు తప్పించు కున్నట్లు తెలిసింది. వారి కోసం గాలింపు చర్యలు విస్తృతంగా చేపట్టారు. మృతి చెందిన మావోయిస్టులలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు వున్నట్లు భావిస్తున్నారు. ఈ ఘటనలో మావోయిస్టుల తో పాటు ఇద్దరు డి ఆర్ జి జవాన్లు మృతి చెందారు. మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని తొలుత బిజాపూర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం విమానం లో మెరుగైన చికిత్స కోసం రాయపూర్ కు తరలించారు. ఈ ఎన్ కౌంటర్ ను మావోయిస్టు లను నిర్మూలన కోసం ప్రత్యేకంగా నియమించబడ్డ డి ఐ జి సుందర్ రాజ్ పట్వా ధ్రువీక రించారు. 2025 లో ఇప్పటి వరకు 65 మంది మావోయిస్టులు ఎంకౌంటర్ లో మృతి చెందినట్లు పేర్కొన్నారు.

**జవాన్ లను అభినందనలు తెలిపిన సిఎం, హెూమ్ మంత్రి**

ఛత్తిస్ గడ్ లో 31 మావోయిస్టులను మట్టు బెట్టిన డి ఆర్ జి జవాన్లను ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, హెూమ్ మంత్రి శర్మ అభినందనలు తెలిపారు. ఈ ఘటన లో మృతి చెందిన ఇద్దరు జవాన్ లు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. వారి త్యాగం మరువలేనిదని, వారి కుటుంబాలకు సంతాపం తెలియజేసారు. కేంద్ర హెూమ్ శాఖ మంత్రి పేర్కొన్నట్లు 2026 మార్చి 26వ తేదికి మావోయిస్టులు తుడుచి పెట్టుకుపోతారని ఆశభావం వ్యక్తం చేశారు.



## ఢిల్లీ ముఖ్యమంత్రి రేసులో
# పర్వేశ్ సింగ్?

మొదటి పేజీ తరువాయి...

ఇప్పుడు చూద్దాం.

**రాజకీయాలకు కొత్తేం కాదు**

27 ఏళ్ల తర్వాత దిల్లీలో జయభేరి మోగించిన కమలదళం, ఇప్పుడు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి పదవి రేసులో పర్వేశ్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. న్యూదిల్లీ నియోజకవర్గంలో 30వేల 88 ఓట్లు సాధించిన పర్వేశ్ వర్మ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై 4 వేల 89 ఓట్ల తేడాతో గెలుపొందారు. వర్మ కుటుంబం రాజకీయాలకు కొత్తదేం కాదు.

**భారీ మెజారిటీలు సాధించే నేతగా!%శ్రీ**

దిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడే పర్వేశ్ వర్మ. అదే న్యూదిల్లీ నియోజకవర్గంలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ దిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు. దీక్షిత్‌కు ఓటమి తప్పలేదు. పర్వేశ్ వర్మ దిల్లీ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటారు. 2013లో ఆయన తొలిసారి మహరోలీ శాసనసభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ దిల్లీ లోక్‌సభ స్థానంలో 2 లక్షల 68 ఓట్ల తేడాతో సత్తాచాటారు. ఇక 2019లో మళ్లీ పశ్చిమ దిల్లీ నుంచి పోటీ చేసి ఏకంగా 5 లక్షల 78 వేల ఓట్ల భారీ మెజారిటీతో జయకేతనం ఎగరవేశారు. భారీ మెజారిటీలు సాధించే నేతగా బీజేపీలో పర్వేశ్ వర్మకు మంచి పేరుంది.

పర్వేశ్ వర్మ పూర్తి పేరు పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ. ఆయన తండ్రి సాహిబ్ సింగ్ వర్మ 1996 నుంచి 1998 మధ్య దిల్లీ ముఖ్యమంత్రిగా సేవలందించారు. దిల్లీ మాజీ సీఎం మదన్‌లాల్ ఖురానా తర్వాత సాహిబ్ సింగ్ వర్మ ముఖ్యమంత్రి అయ్యారు. 1999లో ఎంపీగా గెలుపొందారు. వాజపేయీ ప్రభుత్వంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ రాజకీయాల్లో వచ్చిన పర్వేశ్ ఇప్పుడు సీఎం పదవి రేసులో ముందు నిలిచారు. బీజేపీ అధిష్ఠానం ఆయన పేరును కూడా సీఎం పదవికి పరిశీలిస్తున్నట్లు సమాచారం.

అయితే సీఎం విషయంపై పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ మాట్లాడారు. "మార్పును కోరుకుంటూ బీజేపీపైపై విశ్వాసం ఉంచి గెలిపించిన దిల్లీ ప్రజలకు నా ధన్యవాదాలు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అయితే ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్ఠానమే నిర్ణయిస్తుందని ఓ జాతీయ మీడియా అడిగిన ప్రశ్నకు పర్వేశ్ సమాధానమిచ్చారు.



## బస్సును ఢీకొట్టిన ట్రక్కు
# 41 మంది దుర్మరణం

**మెక్సికో ఫిబ్రవరి 9:** దక్షిణ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాంకున్ నుంచి టబాస్కోకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైంది. ఎస్కార్సెగా నగరానికి సమీపంలో ఈ ట్రావెల్స్ బస్సును ఓ ట్రక్కు ఢీకొనడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 41 మంది సజీవ దహనమయ్యారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం సమయంలో బస్సులో మొత్తం 48 మంది ప్రయాణికులు ఉన్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై టాబాస్కోలోని కమల్‌కాల్కో మేయర్ ఒవిడియో పెరాల్టా స్పందించారు. ప్రమాద ఘటన తీవ్ర విచారకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు చెప్పారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు స్పీడ్ లిమిట్‌లోనే, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదన్నారు.

## తెలంగాణలో
# తొలి జీబీఎస్ రోగి మృతి

మొదటి పేజీ తరువాయి...

కిందట నరాల నొప్పులతో మహిళ అనారోగ్యం బారిన పడింది. దీంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట, హైదరాబాద్‌లోని నిమ్స్, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఇలా ఆమె వైద్యానికి రూ.లక్షలు వెచ్చించారు. అయినా ఫలితం లేకుండాపోయింది. చివరికి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని పుణెలో జీబీఎస్ కారణంగా పలువురు మృతి చెందారు. ఇప్పటికే చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ వ్యాధితో మరణం సంభవించడం ఇదే మొదటిదని వైద్యులు తెలిపారు.



శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన ఆలయానికి రాజస్థాన్ శాసనసభ్యులు మహత్ బలకనాథ్ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయనకి ఆలయ పిఆర్ ఓ రవి, బిజెపి నాయకులు చందు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. గురు దక్షిణామూర్తి వద్ద ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

-శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):

## శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన




**ఉప్పల్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం శృతిలయ డాన్స్ అకాడమీ గురువు మంజు మోహిని శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. రోహిణి, శాంతి, నళినాక్షి, హాసిని, అనన్య, మొదలైన వారు కళింగ నర్తన, నాట్య హెల్త్, కొలువైఉన్నడే, జయ జయ దుర్గే, మూషిక వాహన, రామాయణ శబ్దం, భో శంభో, తిల్లాన, బ్రహ్మామొక్కటే, వినాయక కౌతం కొలువైతివారంగా సాయి, నమశ్శివాయతే, బ్రహ్మాంజలి, అర్ధనారీశ్వరం, భామాకలాపం, బృందావన నిలయే, ఒకపరి కొకపరి, దశావతారం, జనుత శబ్దం మొదలైన అంశాలను ప్రదర్శించారు.

## ట్రస్మా ఉప్పల్ మండల అధ్యక్షుడికి సన్మానం



**రామంతాపూర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ఉప్పల్ మండల అధ్య క్షుడిగా రామంతాపూర్ ఎస్వీ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ పర్యాద వెంకటేశ్వరరావు ఎన్నికైన సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఏ. జలీల్ పాషా ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జలీల్ పాష మాట్లాడుతూ రామంతపూర్ లో ఎస్ వి గ్రామర్ హై స్కూల్ ఏర్పాటు చేసి అనేకమంది పేదలకు ఉచిత విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషికి విద్యాసంస్థల యాజమాన్యాల గుర్తించి ఆయనకు ఉప్పల్ మండల అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల ఎంఏ. జలీల్ పాషా వర్షం వ్యక్తం చేశారు. పేద మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు తక్కువ ఫీజు తీసుకుంటూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు సంతోష్, జంగారెడ్డి, అంజయ్య వెంకటేశ్వర్లు రబ్బాని, పెంటయ్య, నదీమ్, ప్రవీణ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## జాన్ వెస్లీని సన్మానించిన ఉప్పల్ సిపిఎం నేతలు



**ఉప్పల్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** సిపిఎం తెలంగాణ రాష్ట్ర నూతన కార్యదర్శిగా సంగారెడ్డి మహాసభల్లో ఎన్నికైన జాన్ వెస్లీని ఆదివారం ఉప్పల్ సిపిఎం కార్యాలయంలో ఉప్పల్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ పార్టీ నిర్ణయించే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్, హిమబిందు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.వినోద, రాజశేఖర్, ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే.వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యులు ఊర్మిళ, లలిత, సామల నాగరాజు, శేషు, భీష్మచారి, వై.వెంకటేశ్వర్లు, సిపిఎం పార్టీ ఉప్పల్ సర్కిల్ నాయకులు మురళీమోహన్, పట్టాభి రామయ్య, వెంకటేష్, ఊర్మిళ, కుమార్, పరశురాం, బాలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘట్ కేసర్ లో బిజెపి విజయోత్సవ సంబరాలు



**ఘట్ కేసర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ఘట్కేసర్ లో ఘనంగా బిజెపి విజయోత్సవాలు. దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి గెలుపొందిన సందర్భంగా మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి ఆద్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరిపారు. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాళ వేసి నివాళులు అర్పించారు. రహదారిపై బిజెపి జెండాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఓటర్లు బిజెపికి 27 సంవత్సరాల తరువాత అధికారం కట్టబెట్టడంతో పార్టీ ఘన విజయం సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు వి.హనుమాన్, నాయకులు గుండ్ల బాల్ రాజ్, కోటేశ్వరరావు, రామతీర్థ, విక్రాంత్ రెడ్డి, మదుసూదన్ గౌడ్, వీరశం, చంద్రశేఖర్, సిద్దిరాజ్, క్రిష్ణ యాదవ్, మమతశర్మ, అంజనేయులు, బాల్ రాజ్ , చెరుపల్లి చంద్రకళ ఆకుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి హయాంలో ముస్లింలకు అన్యాయం

- దుల్హన్ పథకం పున ప్రారంభానికి కృషి
- ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ ని సన్మానించిన షాకీర్ అలీ



**శ్రీ కాళహస్తి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటశదీర్ రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ మైనారిటీ సలహాదారులు. ఎంఏ షరీఫ్ ని రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వహక కార్యదర్శి షాకిర్ అలీ ఆదివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మైనారిటీ రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వహక కార్యదర్శి షాకిర్ ఆలీ తో షరీఫ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి పథకాన్ని నేడు కూటమి ప్రభుత్వంలో పున ప్రారంభించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేష్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీ పథకాలన్నీ నిర్వీర్యం అయ్యాయని. ఆంక్షలు పేరుతో దుల్హన్ పథకం రాకుండా పోయిందని. రాష్ట్రంలో ఉర్దూ స్కూల్స్ పూర్తిగా శిథిలావస్థకు చేర్చారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఉర్దూ భాషను ఉర్దూ స్కూల్స్ లో ముస్లిం సోదరులకు కౌన్సిలింగ్ చేసి ఉర్దూ భాషను అభివృద్ధి పరచాలని, స్కూల్‌కు పిల్లలను పంపే విధంగా చూడాలని కోరారు. మన ప్రభుత్వం వచ్చినాకే ఉర్దూ స్కూల్స్ మీద దృష్టి పెట్టామని దానిలో భాగంగానే ప్రతి జిల్లాలో విజిట్ చేస్తున్నానని తెలిపారు. నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తు ఎక్కడ ఏఏ లోపాలు ఉన్నాయని గుర్తించి సరి చేయడానికి చూస్తున్నామని తెలిపారు. నారా లోకేష్ ఉర్దూ స్కూల్స్ ను ఉర్దూ భాషను అభివృద్ధి పరిచే విధంగా ప్రయత్నిస్తున్నారని ఎం ఏ షరీఫ్ తెలిపారు. ఆంక్షల పేరుతో ముస్లింలకు జగన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందకుండా చేసిందని ఆయన ఆరోపించారు. అయితే నేడు చంద్రబాబు ప్రభుత్వంలో ఆంక్షలు లేకుండా దుల్హన్ పథకం త్వరలోనే ముస్లిం సోదరులకు అందజేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. త్వరలో ఆ శుభవార్త కూడా ముస్లిం సోదరులు వింటారని వివరించారు. రంజాన్ తోఫా,షాదీ మహల్ డెవలప్మెంట్, బరేల గ్రౌండ్స్ డెవలప్మెంట్స్,మసీదులో మౌజన్, ఇమాములకు జీతభత్యాలు వంటివి అన్ని తప్పకుండా ముస్లిం సోదరులకు చేయడానికి చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముస్లిం సోదరులకు ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదుని తెలిపారు. అనంతరం షాకిర్ అలీ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముస్లింల అభివృద్ధి దివంగత మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలోనే జరిగిందని వివరించారు. శ్రీకాళహస్తిలో కూడా ముస్లిం సోదరులకు గతంలో దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో షాదిమహల్స్, ఈద్గాలో జరిగిన అభివృద్ధి తప్ప గతంలో ఏమి జరగలేదని తెలిపారు. అయితే ఆయన తనయుడు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముస్లిం సోదరుల కోసం అన్ని విధాల సహకరిస్తున్నారని. ఇటీవలే ఈదులగుంట వద్ద ఉన్న ఈద్గా సంబంధించిన అభివృద్ధి పనులు, షాది మహల్ మరమ్మత్తులను రంజాన్ లోపు పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారని అన్నారు. నాడు ముస్లిం సోదరులకు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఏవిదంగా సహకారం అందించారో, నేడు అన్ని విధాల ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముస్లిం సోదరులకు అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మైనారిటీ సలహాదారు ఎం ఏ.షరీఫ్ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం





- ప్రజా సంక్షేమం మహిళల ఆర్థిక అభివృద్దే ధ్యేయం
- టిడిపి నేత పులివర్తి సుధారెడ్డి

**చంద్రగిరి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం లోని ఇరంగారిపల్లి, చెన్నుగారిపల్లి, సామిరెడ్డిపల్లి పంచాయతీల లోని మహిళతో ముఖాముఖి కార్యక్రమం ఆదివారం టిడిపి నేత పులివర్తి సుధా రెడ్డి నిర్వహించారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి పాకాల జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణమనేని సావిత్రి, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి,మీనా పాల్గొన్నారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి విచ్చేసిన టిడిపి మహిళా నేత పులివర్తి సుధారెడ్డికి మహిళలు ఘన స్వాగతం పలికారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పంచాయతీలలో ఉన్న ఇతర సమస్యలను తెలుసుకొన్నారు. మహిళల పొదుపు సంఘాలు,ఏ విధంగా ఆర్థికంగా ఎదగవచ్చునో తెలియజేస్తూ మండలంలోని పంచాయతీలలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసినచ్చిన మహిళలను పులివర్తి సుధారెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాక పంచాయతీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలోని సమస్యలు డ్రైనేజ్, వాటర్ ట్యాంక్,ఇంటి పట్టాలు, కమ్యూనిటీ హాల్ ఇతర సమస్యలను మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి దృష్టికి స్థానిక మహిళలు తీసుకొచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలాగా చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. యుద్ధ ప్రాతిపదికన పరిష్కారమయ్యే పనులను త్వరలోనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.


# సీనియర్ సిటిజన్స్ క్లబ్‌కు.. 400 గజాల స్థలం 20 లక్షల నిధులు

## కార్పొరేటర్ రజిత రెడ్డికి కృతజతలు తెలిపిన ప్రతినిధులు



**ఉప్పల్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ఉప్పల్ సీనియర్ సిటిజన్స్ క్లబ్‌కు అన్ని వేళలలో అండగా నిలుస్తానని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. క్లబ్‌కు మంచి రోజులు వచ్చాయన్నారు. క్లబ్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఉప్పల్ మెయిన్ రోడ్డులో ఉప్పల్ సీనియర్ సిటిజన్స్ క్లబ్‌కు ఇప్పటికే కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి సుమారు 400 గజాల స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందే. ఇదే కాకుండా క్లబ్‌లో మౌళిక వసతులు, ఇతర ఏర్పాట్లకు రూ.20 లక్షల నిధులను కూడా కేటాయించారు. దీంతో ఉప్పల్ సీనియర్ సిటిజన్స్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఉప్పల్‌లో మొదటి సారిగా క్లబ్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించడంతో పాటు అందులో మౌళిక సదుపాయాలను కల్పించేందుకు నిధులను మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షులు మేకల రాంరెడ్డి ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్ మనోహర్ కుమారస్వామి నారాయణ గౌడ్ విజయకుమార్ లాలాపేట నర్సిహ్మ రెడ్డి మందముల అంజిరెడ్డి పాల్గొన్నారు.

# చిత్తారమ్మ జాతరలో జంగయ్య యాదవ్ పూజలు





## హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ తదితరులు

**మేడ్చల్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** మేడ్చల్ నియోజకవర్గంలోని శామీర్ పేట్ మండల పరిధిలోని పొన్నాల గ్రామంలో గండి చిత్తారమ్మ జాతర మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ, పొన్నాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటకూర వజ్రెష్ యాదవ్,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ పలువురు నాయకులుతో కలిసి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితో పాటు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నర్సింహులు యాదవ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి ,గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట్ శ్రీనివాస్, కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల కృష్ణ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కోమలత,మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్లు దోసకాయల వేంకటేశ్, నర్సింహులు, పొన్నాల మాజీ సర్పంచ్ సత్యనారాయణ,మాజీ ఉప సర్పంచ్లు గడ్డం రమేష్, రమేశ్, నాయకులు లక్ష్మా రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శశిధర్ రెడ్డి, జగదీశ్ గౌడ్, బన్నీ, భాను చందర్ గారు, వేంకటేశ్, వంశీ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# టియుసిఐ కరపత్రాలు ఆవిష్కరణ



**సింగరేణి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సమూలంగా మార్చేసి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక హక్కులు పాలకుల ప్రభుత్వాలు ఇచ్చిన కావు, కార్మిక వర్గం దశాబ్ద కాలం పాటు అనేక పోరాటల ద్వారా సాధించుకున్న చరిత్ర కార్మిక వర్గానికిఉన్నదని టి యు సి ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ అన్నారు. కారేపల్లి మండలం టేకులగూడెంలో మహాసభ కరపత్రాహిష్కరణ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కారేపల్లి మండలంలో అనేక సమస్యలపై టి యు సి ఐ పోరాడుతున్నది. మాదారంలో డోలామైట్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హక్కుల కోసం రాజీ పడకుండా పోరాటాలు చేస్తుంది. అంతేగాక కేంద్ర ప్రభుత్వం లాభంలో నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు కరణకు వ్యతిరేకంగా ప్లాంట్ పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు కోసం నిత్యం పోరాటం చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా మండలంలో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా చెస్తున్నటువంటి గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని పోరాటాలు చేసిన ఈ తరుణంలో టియుసిఐ తమ ప్రథమ మహాసభను కారేపల్లి మండల కేంద్రంలో ఫిబ్రవరి 16న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టియుసిఏ జిల్లా నాయకులు సక్రనాయక్ జోగ నాగేశ్వరావు, భూక్య రమేష్, బండారు ,కోటేశ్వర రావు, కేలోతు రాజు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా మునుగేపల్లి లో స్థానిక గ్రామపంచాయతీ కూడలి వద్ద కురుమ సంఘం ఉపాధ్యక్షులు లింగం రవి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ నవాబ్ పటేల్. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువతో సత్కరించి నిండు నూరేళ్ల సుఖశాంతులతో ఉండాలని ఆశీర్వదించారు. యువత చదువుకొని భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలువాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మన్నె లింగం, బిరుగొండ పుట్టి కాశి రమేష్ లింగం దుర్గేష్ శంకర్ దుర్గ ప్రసాద్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

-నిజాంపేట్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):

## పాఠశాల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ముస్తాబాద్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. వారిని తోట ధర్మేందర్ కలిసి గ్రామంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణం గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతూ, నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయయని, విద్యార్థులు చెట్ల కింద చదువుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించి పాఠశాలను సందర్శించారు. పాఠశాలను పరిశీలించి ఏమి అవసరాలు ఉన్నాయో తెలుసుకొని వెంటనే ఎంపీడీవోతో మాట్లాడి భవనాన్ని వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని అదేవిధంగా వంటశాల, ప్రహరీ గోడ వెంటనే నిర్మాణం చేయాలని ఎంపీడీవో, గ్రామ సెక్రటరీ, ఎమ్మార్వో కు చెప్పడం జరిగిందని ధర్మేందర్ పేర్కొన్నారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించి పాఠశాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## డాక్టర్ జయ ప్రసాద్ కు గవర్నర్ అవార్డు



**తాండూరు, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** తాండూరు నివాసి అయిన డాక్టర్ జయ ప్రసాద్ (జనరల్ సర్జన్) అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, వైద్య విభాగంలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుండడంతో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ డాక్టర్ గా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డా. జయ ప్రసాద్ మాట్లాడుతూ గవర్నర్ చేతుల మీదుగా తాను అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవార్డుతో ఇంకా బరువు బాధ్యతలు పెరిగాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు మురళీధర్ రావు, డి.ఆర్‌ఓఎల్ డైరెక్టర్ శ్రీనివాస్ మూర్తి, అధికార భాషా సంఘం నేత విజయబాబు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా రెడ్డి



**బాలాపూర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26 వ డివిజన్ అల్మాస్ గూడ గడ్డంలో ఫేస్ 1 లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీస్ శాఖకు నూతన వాహనాలు అందజేశారని, రాష్ట్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అనుసంధానం చేయడంతో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కంట్రోల్ లో ఉన్నందున పరిశ్రమలు రాష్ట్రానికి రావడంతో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏనుగు రామిరెడ్డి, నాయకులు బోయపల్లి శేఖర్ రెడ్డి, ముత్యాల కృష్ణ, గుర్రం సాయి కిరణ్ రెడ్డి, అశోక్ బీఆర్ఎస్ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### విద్యార్థులకు బహుమతులు అందజేసినా అకాడమీ టీచర్స్



**పహాడీషరీఫ్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ ఉద్యమకారుడు, జల్పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఫిరోజ్ అన్నారు. వెంకటాపూర్ లో ఓ ఫంక్షన్ హాల్ లో టైగర్ చోటే ఖాన్ కరాటే ఆర్గనైజర్ జాఫర్ ఖాన్ ఆధ్వర్యంలో కరాటే లో ప్రతిభను చాటిన 16 మంది విద్యార్థులకు సర్టిఫికెట్, బెల్ట్ ను, బహుమతులను ప్రదానం చేశారు. అభినందించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఫిరోజ్ మాట్లాడుతూ రోజూ కొంత సమయం ఆటలతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే శిక్షణకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోహెల్ సహాది, జీనత్ బేగం, పరహాన్ బేగం విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రణీతకు ఘన సన్మానం



**దమ్మాయిగూడ, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 13, 14 వార్డుల్లో గల శ్రీ సాయి హరి హర ప్రశాంతి & బోరెడ కాలనీలో శనివారం ఐదు సంవత్సరాల పరిపాలన ముగిసిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ రమేష్ గౌడ్ లకు కాలనీ అధ్యక్షులు వేణు మాధవ్ మూర్తి, వారికి చిరు సత్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు వేణుమాధ మూర్తి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలపాటు తమకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అందించారని వారి సేవలు కూడా ముందు కొనసాగించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్,ఈశ్వర్, గిరీధర్, రాజేష్, శంకర్ నారాయణ, మురళీకృష్ణ, ఉమామహేశ్వర్, కాలనీ సభ్యులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని జయప్రదం చేశారు.

## తాండూరులో ఉచిత వైద్య శిబిరం

### అమ్మ ఆదరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సునీత



**తాండూరు, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** అమ్మ ఆదరణ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సునీత నిర్వహణలో తాండూరు పట్టణ కేంద్రంలోని విలేమున్ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నగరం నుండి వివిధ వైద్య విభాగాల వైద్య నిపుణులు గుండె వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ 150 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. వివిధ అనారోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి నగరంలోని తమ ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని రావాలని కోరారు. వారికి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది, మెథడిస్ట్ చర్చ్డి.ఎస్.జనార్ధన్, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## వాకర్ ఇంటర్నేషనల్ 303 కు.. సలంద్రి వాకర్స్ అసోసియేషన్

### ఆరోగ్యకరమైన జీవనానికి నడక ఉత్తమ మార్గం




**ధర్మపురి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం సలంద్రివాకర అసోసియేషన్ కమిటీ సభ్యులు వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఇన్ స్టాలేషన్, క్యాబినెట్ సమావేశం 303 వరంగల్ జిల్లాకు తరలి వెళ్లారు. వాకర్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ కు వివిధ జిల్లాల ప్రతినిధులు రాష్ట్ర,ఇంటర్నేషనల్ వక్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడువు నడిపించు,ప్రతి మనిషికి జీవన ప్రమాణాన్ని జీవనశైలిని మారాలంటే వాకింగ్ అనేది ఎంతో అవసరమని, జీవనశైలిని మారాలంటే వాకింగ్ అనేది ఎంతో ప్రాముఖ్యమైనదని దీన్ని ఎంతో ప్రాముఖ్యత దేహమే దేవాలయం అని చూసుకున్నప్పుడే నడక ఎంతో అవసరమని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బొల్లి స్వామి,ప్రధాన కార్యదర్శి దేవి రాజలింగం, కోశాధికారి దేవి పోచయ్య, ఇంటర్నేషనల్ కార్యవర్గ సభ్యులు, ద్యాగటి కొమురయ్య,గోనె సత్యం,పులి విట్టల్,బై కాని కుమార్ పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలి

- వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఎరువులు
- పోత్గల్ గ్రామంలో పర్యటించిన కలెక్టర్





**ముస్తాబాద్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఆదివారం ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని, వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ల్యాబ్, వార్డు, తదితర వాటిని పరిశీలించి అందుబాటులో ఉన్న పరికరాలను ఉపయోగించుకుని వైద్య సేవలు అందించాలని అన్నారు. అనంతరం గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వసతి గృహంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు వారికి ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తున్నారని ప్రశ్నించారు. మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేవా అనే విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. వసతి గృహంలోని స్టోర్ రూమ్, వంటగది డార్మెట్రీలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు ఆడుకోవడానికి క్రికెట్ కిట్ సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. తదనంతరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాంను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న ఎరువుల గురించి ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత మంది రైతులకు ఎంత ఎరువులు విక్రయించారు, వాటి ధరలు ఎంత అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల లభ్యత గురించి రైతులు ఆందోళన చెందవద్దని, అందుబాటులో ఎరువులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎరువుల లభ్యత, ధరలకు సంబంధించిన పట్టికను గోదాం బయట ఏర్పాటు చేయాలని ప్యాక్స్ కార్యదర్శిని ఆదేశించారు. చివరగా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న తరగతి గదులు పూర్తి చేయడంలేదనే విషయాన్ని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నిర్మాణం పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని తహాశీల్దార్, ఎంపీడీఓను కలెక్టర్ ఆదేశించారు. సందర్శనలో జిల్లా వైద్యాధికారి డా.రజిత, పిఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి, తహాశీల్దార్ సురేష్, ఎంపీడీఓ బీరయ్య, మెడికల్ ఆఫీసర్ డా.గీతాంజలి, వార్డెన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 18 వేల పెన్షన్లను తొలగించిన కూటమి ప్రభుత్వం

### గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి



**గన్నవరం, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ఓడ ఎక్కిందాకా ఓడ మల్లయ్య ఓడ దిగిన తరువాత బోడి మల్లయ్య అన్న సామెత లాగా ఎన్నికల ముందు ఇంటిలో ప్రతి వ్యక్తికి ఆర్థిక సహాయం చేస్తానని చెప్పి ఇప్పుడు గత ప్రభుత్వం పేదలకు కులము మతం రాజకీయం చూపకుండా ప్రతి పేదవాడికి జగనన్న భరోసాతో ఇచ్చిన పెన్షన్లను ఎన్.డి.ఎ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇంటిలో ప్రతి వ్యక్తికి ఆర్థిక సహాయం చేస్తానని చెప్పి ఇప్పుడు రద్దు చేయటాన్ని గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండించారు. ఆమే మాట్లాడుతూ ఏపీలో 18,036 మంది పింఛన్లను తొలగించారని అన్నారు. ఆ పేద కుటుంబాలు నోటి కాడ కుడు తీసి వేసి వాళ్ళని రోడ్డున పడేయటం చాలా దుర్మార్గం పరిస్థితి ఈ సర్కార్ తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీని జాబితా ప్రారంభించిన సంగతి అందరికి తెలిసిందే. దివ్యాంగ పింఛన్లు అనర్హులను ప్రభుత్వం తొలగించడంతో జనవరిలో 63,77,943 మంది పింఛన్ లబ్దిదారులు ఉండగా ఫిబ్రవరిలో 63,59,907కు తగ్గింది. దీంతో పింఛన్ల జాబితా నుంచి తొలగించిన 18,036 మంది ఇకపై పింఛన్ పొందలేరని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన పింఛన్ దారులను వెంటనే చేర్చి వారికి న్యాయం చేయాలని, లేకుంటే అప్పుడు ఆ పేద ప్రజలే ఎన్.డి.ఎ కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అణగారిన వర్గాల ఆశాదీపం అంబేద్కర్



### టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్

**ఘట్ కేసర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** అణగారిన వర్గాల అభివృద్ధికి పోరాడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని టి పి సి సి ఉపాధ్యక్షుడు, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ ఆశయ సాధన సమితి అంబేద్కర్ జ్ఞాన మాల 200 వారానికి చేరిన సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి కొలమానం అంబేద్కర్ ఆలోచన విధానం అని, అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితానికి త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానమే ఈ దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, సింగల్ విండో ఛైర్మెన్ సింగిరెడ్డి రామ్ రెడ్డి,ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్,మల్లి జంగయ్య యాదవ్, బర్ల రాధా కృష్ణ, ఘట్కేసర్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నీడలో గ్రామాలు

- సీసీ కెమెరాలతో అనేక ప్రయోజనాలు
- సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వస్తున్న ప్రజలు
- ఏర్పాటు కోసం గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- నేర పరిశోధన, నియంత్రణలో కీలకం
- సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి
- పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి




**పెబ్బేరు, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** నేరాలను అదుపు చేసేందుకు పెబ్బేరు పోలీసులు నడుం భిగించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి వారిని మరింత ప్రోత్సహిస్తున్నారు. శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్,డిఎస్పి వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు ఆదేశాల మేరకు పెబ్బేరు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నిఘానేత్రాలు నేరాలకు అడ్డుకట్ట వేయడానికి దోహదపడుతున్నాయి. సీసీకెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు,నేరాలు చేయడానికి దొంగలు భయపడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి అవగాహన కల్పించడం వల్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు.ఆయా గ్రామాల్లో సీసీకెమెరాల ఏర్పాటుకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వాటి ఉపయోగాలు ఎస్ఐ తెలియజేస్తున్నారు. గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాల నియంత్రణ, యువత చెడు వ్యవసనాలకు గురికాకుండా ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని తెలియజేస్తున్నారు. పల్లెల్లో ప్రజలకు అవగాహన తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అత్యుత్తమ సేవలు అందిస్తున్నది. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నది. గతంలో మాదిరిగా కాకుండా ప్రతి కేసు విషయంలో ప్రజలకు సత్వర న్యాయం అందించేలా, వారికి రక్షణ కల్పించేలా కృషి చేస్తున్నది. ఈ క్రమంలో 'మేము సైతం' అనే కార్యక్రమం ద్వారా పెబ్బేరు మండలంలోని పోలీసు అధికారులు పల్లెలు, తండాల్లో పర్యటిస్తూ సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. గ్రామాన్ని బట్టి ఎన్ని కెమెరాలు అవసరమవుతాయి, కంట్రోల్ యూనిట్ ఎక్కడ ఏర్పాటు చేయాలి అనే అంశాలపై వారికి వివరిస్తున్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటూ కేసుల ఛేదనలో వాటి ప్రాముఖ్యాన్ని ప్రజలకు లోతుగా వివరించారు. ఇటీవల పలు కేసుల్లో సీసీ కెమెరాల సాయంతో ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి నిందితులను పట్టుకున్నారు. ముఖ్యంగా దొంగతనాలు, ర్యాగింగ్ నివారణలో ఉత్తమంగా పనిచేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరిగింది. దొంగలు, దోషులను పట్టుకోవడంలో మార్గం సుగమం అవుతున్నది. ప్రస్తుతం పల్లెల్లోనూ సీసీ కెమెరాలు పెడుతున్నారు. గతంలో దొంగతనాల పరిశోధన కొంత ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడు సీసీలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పడ్డాయి. సీసీ ఫుటేజీల ద్వారా దోషులను గుర్తించి, గంటల వ్యవధిలోనే పట్టుకోగలుగుతున్నాం. ఎస్పీ రావుల గిరిదర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సిఐ రాంబాబు ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు తమ వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలి. నేర నియంత్రణ, రక్షణ కల్పించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

## బాలాజీ హిల్స్ పేస్-3 కాలనీ అధ్యక్షుడిగా నరేందర్ రెడ్డి



**ఉప్పల్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** బాలాజీ హిల్స్ ఫేస్-3 కాలనీ అధ్యక్ష ఎన్నికల్లో ప్రెసిడెంట్ గా బోరెడ్డి నరేందర్ రెడ్డి సెక్రటరీగా వేణుమాధవ్, ట్రెజరరీగా వెంకటేష్ నియమితులయ్యారు. వీరిని మాజీ ప్రెసిడెంట్ ఈ. రంజిత్ రెడ్డి శ్రీనివాసరావు, ఉపేందర్ రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం సాయి శక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. కాలనీ సభ్యులందరినీ కలుపుకొని పోయి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు. తాను చేసే కార్యక్రమాలకు సభ్యులు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## బిజెపిలో చేరిన మహిళా నేతలు

### ప్రధాని నరేంద్ర మోడీ పాలనకు అన్ని వర్గాల మద్దతు



**బాలాపూర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** దేశంలో ఏ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీయేదే విజయం అని బీజేపీ సీనియర్ నాయకులు కోలను శంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మీర్పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు బిక్షపతి చారి ఆధ్వర్యంలో మాజీ వార్డ్ సభ్యురాలు, కాసోజు హోర్షిత, అలిశెట్టి కల్పన, పున్న గాయత్రి, ఎల్లంకి రేణుక, నడికుడి వర్షిత, కాంచనపల్లి మాధురి, పల్లవి, లక్ష్మి లు పార్టీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ పాలన సాగుతుందని అందుకే ప్రతి ఎన్నికలలో వచ్చినా బిజెపి విజయఢంకా మోగిస్తుందని అన్నారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిజెపి విజయం తథ్యమని ఆయన తెలియజేశారు. ఢిల్లీలో బిజెపి గెలిచిన సందర్భంగా మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి బిజెపి మాజీ కార్పొరేటర్లు కీసర హరినాథ్ రెడ్డి, ఏ. భీంరాజ్ సీనియర్ నాయకురాలు హరిత నాయకులు రాధాకృష్ణ, కే.శ్యాంసుందర్, కార్తీక్, సాగర్, ఎం.చందు, ఎం.శివకుమార్ చారి, శ్రీనివాసచారి, మనీష్, ప్రభాకర్ చారి, అనిల్ భాస్కరాచారి, గుండప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



**రామంతాపూర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** రామంతాపూర్‌లోని శ్రీరమణపురం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్టుగా ఉప్పల్ కాంగ్రెస్ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ,తెల్కల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా సహాయ, సహకారాలను అందించనున్నట్టుగా చెప్పారు. రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం స్లాబు నిర్మాణ పనులను పరమేశ్వర్ రెడ్డి, తెల్కల మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, కాలనీవాసులు ఆలయ నిర్మాణానికి పరమేశ్వర్‌రెడ్డి, తెల్కల మోహన్ రెడ్డి సహకారానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలకల మోహన్ రెడ్డి, పి.రాఘవేందర్, పూస శ్రీనివాస్ సత్తిరెడ్డి లూకాస్ సుధాకర్,జి.పాండు, బండారి వెంకటేష్, అల్గోయ్ శ్రీనివాస్, అద్దంకి యాదగిరి, సుంకరి సంతోష్, టి.బాబురావు, సాయిబాబా, బొల్లి రాజు, లింగస్వామి యాదవ్, శ్రీ శ్రీ స్వయంభూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ మెంబర్స్, శ్రీ రమణపురం కాలనీ, రామంతపూర్, నరసింహారెడ్డి త్రిమూర్తులు పాల్గొన్నారు.

# శాఖాహారం పట్ల అవగాహన కల్పించాలి

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు






**తిరుపతి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** అహింసా ధ్యాన మహోత్సవంలో భాగంగా తిరుపతి స్పిర్చువల్ సొసైటీ మెగా శాఖాహార ర్యాలీ నగరంలో ఆదివారం నిర్వహించింది. ఈ ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ప్రశాంత వాతావరణం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మెగా శాఖాహార ర్యాలీ ద్వారా స్పిర్చువల్ సొసైటీ ప్రజల్లో శాఖాహారం పట్ల అవగాహన తీసుకురావడం అభినందనీయమని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరు యోగా, ధ్యానం తమ దిన చర్యలో భాగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న ఒత్తిడిని జయించడానకి యోగా చక్కని పరిష్కార మార్గమని ఆయన తెలిపారు. నరేంద్ర మోది ప్రధానమంత్రి అయ్యాక యోగాను ప్రపంచవ్యాప్తం చేశారని ఆయన కొనియాడారు. తిరుపతి స్పిర్చువల్ సొసైటీ ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయలు, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు నరసింహాచ్చారి, ఎస్.కే.బాబు, పొన్నాల చంద్ర, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, సింగంశెట్టి సుబ్బరాయులు, వరప్రసాద్, కూరపాటి సురేష్ కుమార్, కోదండ, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏరో బిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించిన నిశాంత్

### అభినందించిన పోచారం మున్సిపల్ మాజీ మేయర్ కొండల్ రెడ్డి



**ఘట్ కేసర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపల్ కి చెందిన నిశాంత్ రెడ్డి తమిళనాడులో జరిగిన ఏడవ స్టేట్ లెవల్ స్పోర్ట్స్ ఏరో బిక్స్ ఛాంపియన్ షిప్ 2025 లో కొంతం నిశాంత్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించిన?



సందర్భంగా నిశాంత్ కి కోచ్ రాజా సింగ్ కీ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలలో దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. యువత ఇలాంటి స్టేట్ లెవెల్ క్రీడల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించడం వల్ల, కన్న తల్లిదండ్రులకు,గ్రామానికి, పట్టణానికి గర్వకారణం అని ఆయన అన్నారు. మునుముందు యువత చెడు దారిలో పోకుండా వారికి నచ్చిన క్రీడల్లో పాల్గొని గ్రామానికి దేశానికి మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ఈ రోజుల్లో యువత చెడు అలవాట్లకు లోనై ఎంతోమంది యువతి, యువకులు చెడిపోతున్నారని వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతు న్నాయని వారు పేర్కొన్నారు. వీలైనంతవరకు విద్య, క్రీడలలో బిజీగా ఉండి వారి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఒక ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

# శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వివాహ వేడుకలు

### ఆలయ ధర్మకర్త ఎన్.ప్రసాద్ రావు



**బెల్లంకొండ, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలోని బీసీ యాదవ బజారులో నిడమనూరు ప్రసాద్ రావు ధర్మపత్ని కోటేశ్వరమ్మ నిడమనూరు బ్రదర్ నిర్మించిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి అంకమ్మ తల్లి పోతురాజు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవం కళ్యాణ మహోత్సవం జరుగు కార్యక్రమాన్ని స్వామి వార్ల భక్తులందరు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొని భాగవదను గ్రహ పాత్రులు కావాల్సిందిగా ఆలయ ధర్మకర్త నిడమనూరి ప్రసాద్ రావు కోరారు. కార్యక్రమాలు 10వ.తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు ఉత్సవమూర్తుల గ్రామోత్సవం కుంకుమ బండ్ల ఊరేగింపు అమ్మవారికి పుట్టింటి పసుపు కుంకుమల సమర్పణ 11వ.తేదీ మంగళవారం ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వర పూజ పుణ్యాహ వచనం ప్రధాన కలస స్థాపన మూలమూర్తులకు విశేష అభిషేకములు అలంకరణ చండీ హోమం జరుగును ఉదయం 11:30 నిమిషాలకు అన్నప్రసాద (అన్నదాన)వితరణ రాత్రి 9:30 నిమిషాలకు పెనిగంచిప్రోలు క్షేత్రంలో పూజలు అందుకున్న ఉత్సవదారు మూర్తులకు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దివ్య లీల శాంతి కళ్యాణ మహోత్సవం జరిపించడం జరుగుతుందన్నారు.స్మార్తగమ ప్రవర బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణి కుమార శర్మ ఆధ్వర్యంలో వేద విజ్ఞులైన ఋరీత్విగ్వరేన్యులచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు ప్రజల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు గౌడ సంఘం వినతి

### సింగరేణి మండల గౌడ సంఘం అధ్యక్షులు పోలగాని శ్రీనివాస్



**సింగరేణి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** కారేపల్లి గౌడ కులస్తులు ఆదివారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను సింగరేణి మండల గౌడ కులస్తుల అధ్యక్షులు పోలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. సంఘ నాయకులు గౌడ కులస్తుల సంక్షేమ అభివృద్ధి కోసం సంఘ నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ గౌడ కులస్తులకు కమ్యూనిటీ హాల్ కేటాయించాలని, గౌడ కులవృత్తిలో భాగంగా తాటి చెట్ల పెంపకానికి స్థలం మంజూరు చేయాలని, గౌడ కులస్తులు 50 సంవత్సరాల వారికి పెన్షన్ మంజూరు చేయాలని, కాటమయ్య కిట్లను మంజూరు చేయాలని రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లు గౌడ కులస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సీటు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా గౌడ కులస్తులు సహకరించారని తెలిపారు. ఎమ్మెల్యే అనుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు పోలగాని శ్రీనివాసరావు, తాళ్ల శ్రీను, గడ్డమీద రామారావు, కస గాని సుబ్బయ్య, అప్పుల శేషయ్య, నాగేశ్వరరావు, రవి, సత్యం నారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచి, ఎంపీటీసీ, జడ్పిటిసి లకు బీ ఫామ్ ఇచ్చేది నేనే

- బస్ డిపో,డిగ్రీ కాలేజీ సంవత్సరంలో ఏర్పాటు చేస్తా
- 125 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్క్
- తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు



**మోత్కూరు, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** మున్సిపల్ కేంద్రం ఆర్యవైశ్య భవనంలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ బిసి కులగణన, వరంగల్ డిక్లరేషన్ రైతుల రెండు లక్షల రుణమాఫీ,చేవెళ్ల రాహుల్ గాంధీ,ఖర్గే ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిన ప్రకారం చేస్తుందన్నారు.బీసీ లలో ముస్లిం మైనార్టీలలో అసలైన బీసీలు ఎవరైతే ఉన్నారో 55 శాతం వచ్చే అవకాశం ఈ రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తుందని, స్పష్టమైన సామాజిక కోణంలో బీసీ కుల సమీకరణ జరుగుతుందని చెప్పారు. ఖరీఫ్,రబీ కాలంలో వాగులో నీళ్లు లేకుండా పొలాలు ఎండిపోయిన రోజులు ఉన్నాయని నేను ఈ ప్రాంత రైతు బిడ్డగా ఒక ఎకరం కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా ఎండిపోకుండా చేయడం జరుగుతుందన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఒక గుంట జాగను అన్యక్రాంతం కాకుండా చూస్తానని అన్నారు. ఈ తుంగతుర్తి నియోజకవర్గానికి దాదాపు రూ.1300 కోట్ల పనులు జరుగుతున్నాయని, మోత్కూరు మున్సిఫ్ కోర్టు సాంకేతికంగా తెలుసుకోవాలని, మోత్కూర్ బస్ డిపోను, డిగ్రీ కాలేజ్ ను ఒక సం.రంలో ఏర్పాటు చేయడం నా బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వానికి లెటర్ రాయడం జరిగిందని అన్నారు.మోత్కూర్ బిక్కేరు వాగు పై కొత్త వంతెన కొరకు రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, ప్రిన్సిపల్ సెక్రటరీకి అపీల్ చేయడం జరిగిందన్నారు. అడ్డగూడూరు మండలం మానాయికుంట,డి.రేపాక, ఆజీంపేట దగ్గర్లో ఉన్న సర్వేనెం. 165 లో గల 125 ఎకరాల భూమిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తానన్నారు. వచ్చే గ్రామ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని,ముందు వచ్చే జరగబోయే ఎన్నికలలో సర్పంచి,ఎంపీటీసీ, జెడ్పిటిసి అభ్యర్థులకు బీ ఫారం ఇచ్చేది నేనేనని, ఇందిరమ్మ ఇల్లు ఏది కావాలన్నా ఇవ్వాలన్నా నేను తప్ప ఎవరూ ఇవ్వరని అన్నారు.నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వారి సలహాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు పోతున్నాను అన్నారు.

# ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### గన్నవరం టిడిపి పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు



**ఉంగుటూరు, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ఏపీ అభివృద్ధి పూర్తి స్థాయిలో జరగాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించాలని గన్నవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఉంగుటూరు మండల ఎన్డీఏ కూటమి నాయకులు, పోలింగ్ బూత్ ఇన్-చార్జులతో ఆదివారం సాయంత్రం గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి జరగాలన్న, పూర్వ వైభవం రావాలన్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘనవిజయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడు నెలల క్రితం ఎంత ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారో పట్టభద్రులు ఎన్నికల్లో కూడా అత్యధికలు ఓటింగ్ లో పాల్గొని ఆలపాటికి గన్నవరం నియోజకవర్గంలో మంచి మెజారిటీ సాధించి శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుకు మరింత బలాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గన్నవరం నియోజకవర్గ టిడిపి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పర్యవేక్షకులు మరియు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధం కావాలని, ఆలపాటి గెలుపుతో వైసిపి నాయకులకు మరొకసారి బుద్ధి చెప్పాలని తెలుపుతూ నాయకులు కార్యకర్తలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశం అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి అలపాటి రాజేంద్రప్రసాద్ యొక్క ప్రచార కరపత్రాలను అందజేస్తూ మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటికి వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, రాష్ట్ర టిడిపి నాయకులు కొండేటి కొండలరావు, టిడిపి సీనియర్ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, అట్లూరి రామ్ కిరణ్, మున్నా రామకృష్ణ, టి సాంబశివరావు, కుందేటి చంద్రశేఖర్, పోలింగ్ బూత్ ఇన్చార్జులు జల్లెడ శ్రీమన్నారాయణ, మాయర రమేష్, బాజీ షరీఫ్, అనిల్, అజీజ్, సంపత్ కుమార్ టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ నిధులతో నాగలాపురంలో సిమెంటు రోడ్డు నిర్మాణం



తిరుపతి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్): తిరుపతి పార్లమెంటు పరిధి సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురం మండలం, నాగలాపురం గ్రామంలో జాతీయ రహదారి 71 ఏ, నుండి పాత పుత్తూరు సత్యవేడు రోడ్డు వరకు ఉన్న మార్కెట్ కమిటీ రోడ్డు గుంతలు పడి, వాహన చోదకులు సుదీర్ఘకాలంగా ఇబ్బందులు ఎదుర్కొనే వారు ఈ విషయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా తెలుసుకున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం ఎంపీ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. నాగలాపురం గ్రామంలోని గుంతలు పడి ఉన్న రోడ్డు పూర్తిగా మారింది, దీంతో గ్రామంలోని రోడ్లు మరింత పటిష్టంగా, సుందరంగా మారాయి, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, గ్రామ ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణం చేయగలుగుతున్నారు. నాగలాపురం నుంచి పిచ్చాటూరు మండలం, ఓబులురాజు ఖండ్రిగ, కారూరు, అడవి కోయంబేడు, చెంచురాజు ఖండ్రిగ, పులిపాడు గ్రామాలకు ఈ మార్గం ద్వారానే ప్రయాణించాలని స్థానికులు తెలిపారు. సమస్య గురించి తెలుసుకొన్న వెంటనే స్పందించి గ్రామంలో రోడ్డు నిర్మాణానికి చొరవ తెసుకొన్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికి గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. తన విజయంలో కీలక పాత్ర పోషించి అత్యధిక మెజారిటీ అందించిన సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పటికీ ఋణపడి ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. సత్యవేడు ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో తనపై చూపిన ప్రేమ, ఆదరణకు తాను ముగ్ధుడినయ్యానని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అవసరమైన కేంద్ర నిధులు తెచ్చేందుకు నిరంతరం పాటుపడతానని స్పష్టం చేశారు.

# రాయల చెరువులో యువకుడి మృతి

### మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించిన పోలీసులు



**రామచంద్రపురం, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** ప్రమాదవశాత్తు రాయల చెరువులో పడి రాయలచెరువు పేట గ్రామానికి చెందిన పెనుగొండ లోకేష్(23) మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రామచంద్రాపురం పోలీసులు సమాచారం మేరకు పెనుగొండ లోకేష్ శనివారం రాత్రి 8 గంటల సమయంలో రామచంద్రాపురం నుండి ఏపీ 39, 8537 నెంబర్ గల బజాజ్ ప్లాటినా మోటార్ సైకిల్ వాహనంలో స్వగ్రామమైన రాయలచెరువు పేటకు వెళుతుండగా రాయలచెరువు కట్ట సమీపమున ఉన్న మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుకు కుడివైపున పక్కనే ఉన్న రాయలచెరువు నీటిలో వాహనంతో పాటు పడిపోయి మృతి చెందాడు . తన కుమారుడు ఇంకా ఇంటికి రాలేదని తండ్రి పెనుగొండ వెంకటరమణ, కుటుంబ సభ్యులు లోకేష్ ఫోన్ కు చేశారు. లోకేష్ ఫోన్ పనిచేయక పోవడంతో రాత్రంతా వెతికారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు రామచంద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రామచంద్రపురం ఎస్ఐ రామాంజనేయులు లోకేష్ ఫోన్ నెంబర్ తో లొకేషన్ ట్రాకింగ్ తీయడంతో ఆదివారం రాయల చెరువులో లోకేష్ మృద్దేహం, ద్విచక్ర వాహనం ఉన్నట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. అనంతరం రాయలచెరువు గ్రామానికి చెందిన యువకులు, కుటుంబ సభ్యుల ద్వారా పెనుగొండ లోకేష్ మృతదేహాన్ని చెరువుల నుండి వెలికి తీసి. మృత దేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ప్రమాదంతో పెనుగొండ లోకేష్ చెరువులో పడి మృతి చెందిన విషయం గ్రామ ప్రజలకు తెలియగానే రాయల చెరువు పేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు,తన్నీరు మున్నీరై శోకసముద్రంలో మునిగి తేలారు. ఆర్ సి పురం ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రకాశం పార్క్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

### మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణకు సన్మానం





తిరుపతి, ఫిబ్రవరి 9 (నిఘాన్యూస్): ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ వారు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ ప్రకాశం పార్క్ లో వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణను వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.జగన్నాథం ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పార్క్ వర్కర్స్ అందరికీ ఈ పార్కును అభివృద్ధి చేసుకోవాలన్న ఆశలు ప్రతి ఒక్కరికి ఉంటాయని ఈ పార్క్ మన అందరిదీ కనుక అన్ని విధాల అభివృద్ధి చేసుకోవాలని ఉంటాది అందుకే పార్కును సంబంధించిన సమస్యలు ఏదైనా ఉంటే కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించి వాకర్స్ కు స్థానిక ప్రజలకు అనుగుణంగా ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు,ఈ సందర్భంగా ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.జగన్నాథం మాట్లాడుతూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషమని అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ ప్రమాణస్వీకారం మహోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తూ నూతనంగా డిప్యూటీ మేయర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన అందుకు సంతోషంగా ఉందన్నారు. అలాగే స్థానిక ప్రజలకు పార్కులు అభివృద్ధికి కృషిచేసి తిరుపతి నగర ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ నాయకులు సభ్యులు యోగా బృందం స్థానికులు పాల్గొన్నారు,ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణకు శ్రీవారి ని దర్శించుకున్న భక్తులుగా ఆయన చిత్రపటాన్ని అతనికి బహుకరించారు.

# ఏకాగ్రతతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

### గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి



**తాండూరు, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** పరీక్షల సమయం సమీపిస్తుండడంతో విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ సరస్వతి వెల్లడించారు. తాండూరు పట్టణ కేంద్రం సమీపంలోని యాలాల మండలం కోకట్ గ్రామ పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తుండడంతో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికల చదువుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం జరుగుతుందని వివరించారు. ఏరోజుకు ఆరోజు జరిగిన పాఠ్యాంశాలపై ప్రశ్న పత్రాన్ని తయారుచేసి, విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, వారి విద్యా స్థాయిని గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. విషయం పట్ల (సబ్జెక్టుల) భయాలు ఉంటే తొలగించడం జరుగుతుందని తెలిపారు. పాఠ్యాంశాల విషయంలో అర్థం కాని అంశాలు ఏవైనాఉంటే నివృత్తి చేయడం జరుగుతుందని అన్నారు.అదేవిధంగా పాఠశాల, కళాశాల సమయం అయినా తర్వాత బాలికలు ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించడం జరుగుతుందని వివరించారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా తనతోపాటు పాఠశాల మహిళ ఉపాధ్యాయులు, కళాశాల మహిళ అధ్యాపకులు విధులు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.

# గన్నవరం క్రీడా ప్రాంగణం అభివృద్ధికి లక్ష విరాళం




**గన్నవరం, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** కృష్ణా జిల్లా, గన్నవరం నియోజక వర్గ కేంద్రమైన గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి వాకర్స్ అసోసియేషన్ పిలుపునందుకుని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శంకర నారాయణ భరద్వాజ శ్రౌతి, సీత దంపతులు లక్ష రూపాయలు విరాళముగా అందజేసినట్లు గన్నవరంవాకర్స్అసోసియేషన్అధ్యక్షులు కే.వి.ఆర్.కిషోర్ ఆదివారం పత్రికలకు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ కీడా ప్రాంగణం అభివృద్ధికి లక్షలాది రూపాయలు వెచ్చించిన విషయం విదితమే. అలాగే వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణంలో అవ్యాన్ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డా.ఝాన్సీ లక్ష్మి చే సభ్యులకు పరీక్షలునిర్వహించారు.వాకర్స్అసోసియేషన్ కార్యాలయం వద్ద ఈ సందర్భంగా శంకర నారాయణ భరద్వాజ శ్రౌతి, సీత దంపతులను, డా.ఝాన్సీలక్ష్మి నుంచి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ పి.డి టి.యస్.ఆర్.కే.ప్రసాద్,వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి సగ్గుర్తి శ్రీనివాస రావు, సలహాదారు తిరివీధి వెంకయ్య, గొల్లనపల్లి, గన్నవరం ప్రధాన ఉపాధ్యాయులు కొల్లి సత్య జగదీశ్వరరావు, రవి బాబు, సభ్యులు చిల్లపల్లి శ్రీనివాసరావు, కోటేశ్వరావు, చిమట రామారావు, లక్ష్మీ నారాయణ,కంకణాల వెంకటేశ్వరరావు వ్యాయామ విద్య సహాయకులు ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆద్యంతం అద్భుతంగా సాగిన స్వరరాగ తరంగిణి సంగీత విభావరిలిలో ఆదివారం ప్రముఖ జానపద గాయకుడు ప్రణయ్ కుమార్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో తన విశ్వరూపం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవీ,మాజీ కేంద్రం మంత్రి వేణుగోపాల చారి, హీరో సుమన్ చేతుల మీదుగా సన్మానం అందుకోవడం సముచితంగా భావిస్తున్నానని జానపద గాయకుడు ప్రణయ్ కుమార్ సంతోషం వ్యక్తపరిచారు.

- హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):

## సముద్ర స్నానానికి వెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి



**విశాఖపట్నం, జిల్లా ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** రాంబిల్లి సముద్రతీరంలో స్నానానికి దిగిన ఇద్దరి ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ఆదివారం విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎం.పవన్ తేజ సూర్య తేజ అనే ఇద్దరు విద్యార్థులు రాంబిల్లి సముద్ర తీర ప్రాంతానికి స్నానం చేయడానికి వచ్చారు. ఈ నేపథ్యంలో అలల తాకిడికి సముద్రంలో మునిగి చనిపోయినట్లు పోలీస్ అధికారులు ధ్రువీకరించారు.

## శ్రీశైలంలో స్వర్ణ రథోత్సవము



**శ్రీశైలం, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం శ్రీ స్వామి అమ్మవార్లకు స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర భిషేకము, అన్నాభిషేకం పూజలు నిర్వహించబడ్డాయి. అనంతరము స్వర్ణ రథోత్సవాన్ని జరిపించారు. ఈ స్వర్ణ రథోత్సవములో ముందుగా అర్చక స్వాములు లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తర్వాత రథారూఢు డైన శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించ బడ్డాయి. ఆదివారం ఉదయం స్వర్ణ రథోత్సవము ప్రారంభమైంది. గంగాధర మండపం నుండి నందిమండపం వరకు తిరిగి నంది మండపం నుండి గంగాధర మండలం వరకు రథోత్స వాన్ని జరిపించారు. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్స వంలో కళాబృందాల కోలాటం, డోలు వాయిద్యము, మొదలైన జానపద కళారూపాలు ఏర్పాటు చేయబడ్డాయి. అలాగే రథోత్సవంలో నామ సంకీర్తన (భజన) గిరిజన చెంచు నృత్యాన్ని కోలాటం ఏర్పాటు చేశారు. ఈనాటి రథోత్సవంలో ఆలయ దేవస్థానము ఈవో ఎం. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ ఈ.చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నరసింహారెడ్డి, అర్చక స్వాములు వేద పండితులు, శివ సేవకులు పాల్గొన్నారు.

## హారన్ ఆపేద్దాం శబ్ద కాలుష్యాన్ని తగ్గిద్దాం

### ఉప్పల్‌లో అవగాహన కార్యక్రమం




**ఉప్పల్, ఫిబ్రవరి9 (నిఘా న్యూస్):** అనవసరంగా హారన్ మోగించడం ఆపేద్దామని, శబ్ద కాలుష్యాన్ని తగ్గిద్దామని రోడ్ సేఫ్టీ స్క్వాడ్, డ్రైవ్ సేఫ్ హైదరాబాద్ బృందం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఉప్పల్ జంక్షన్‌లో, నో హారన్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా వారు ప్లకార్డులను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. అనవసరంగా హారన్ మోగించడం వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను వివరిస్తూ వాహనదారులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఎక్కువగా హారన్ మోగించకుండా, బ్రేకులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ శబ్ద కాలుష్యాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ప్రశంసించారు. హారన్ మోగించకుండా, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని సూచించారు. హారన్ కొట్టకుండా, లైట్లను ఉపయోగించి కూడా అప్రమత్తం చేయవచ్చని చెప్పారు. అవగాహనతోనే సమస్యలను పరిష్కరించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ స్క్వాడ్, డ్రైవ్ సేఫ్ హైదరాబాద్ బృందం ప్రతినిధులు లోకేంద్రసింగ్, నరేష్, రాఘవ్, ఉప్పల్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి మున్సిపల్ మేయర్ రేసులో..

# సంధ్య యాదవ్

- ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పార్టీ తీర్థం
- టిడిపి కూటమి పార్టీల బలోపేతమే లక్ష్యం
- అన్నా డాక్టర్ సంధ్య యాదవ్‌కు
- సీఎం, డిప్యూటీ సిఎం, మంత్రి అండ దండలు
- త్వరలో అన్నా డాక్టర్ సంధ్య యాదవ్‌ను వరించనున్న మేయర్ పదవి

**తిరుపతి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవి ఉత్కంఠ నేపథ్యంలో ముగిసింది. రెండు రోజుల క్రితం డిప్యూటీ మేయర్ నియామకంలో వైసిపి టిడిపి కార్పొరేటర్ల మధ్య రణ పోరు కొనసాగిందని చెప్పవచ్చు.తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్ లలో గత వైసిపి పాలనలో టిడిపి మాజీ నగర అధ్యక్షుడు ఆర్‌సి మునికృష్ణ ఒకే ఒక్క కార్పొరేటర్ గా గెలిచిన నేపథ్యం.ఒక కార్పొరేటర్ పదవి కోర్టు పరిధిలో పోను మిగతా 48 స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. అయితే 2024 ఎన్నికల్లో వైసిపి ఘోరంగా ఓడిపోయి కూటమి అధికారంలోకి వచ్చింది. అప్పటినుంచి తిరుపతి మేయర్ పదవి పై టిడిపి కూటమి కన్ను పడింది.అప్పటికే మేయర్ పదవి కోసం వైసీపీ పార్టీని వీడి టిడిపి పార్టీలోకి చేరిన అన్న రామచంద్రయ్య ఒక్కసారిగా డిప్యూటీ మేయర్ ఎన్నికపై తన సత్తా ఏమిటో చూపెట్టాడు. వైసీపీకి 48 మంది కార్పొరేటర్ల బలం ఉన్న వారిని ఒక్కొక్కరిని వైసీపీ పార్టీ నుండి టిడిపి పార్టీ వైపు వచ్చే విధంగా తన మార్కును అన్న రామచంద్రయ్య చూపెట్టాడని చెప్పక తప్పదు. ఒకానొక దశలో 48 మంది వైసిపి కార్పొరేటర్లు ఒక కార్పొరేటర్ మృతి చెందడంతో మిగతా 47 మంది వైసీపీ కార్పొరేటర్ లను తన వైపు తిప్పుకునేందుకు తన అనుచర గణంతో కలిసి పెద్ద ఎత్తున పావులు కదిపాడు. అయితే మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి వారి అనుచర గణం పట్టు వదలని విక్రమార్కుడి లా విజృంభించారు. ఒకానొక దశలో టిడిపి,కూటమికి వైసిపి గట్టి పోటీనిచ్చింది.





అయితే అధికార పార్టీ ఎన్‌డిఏ కూటమి నాయకులు అండదండలు అన్న రామచంద్రయ్య 50 శాతం కార్పోరేటర్లను టిడిపి వైపు తిప్పి చివరగా డిప్యూటీ మేయర్ పదవిని టిడిపి కార్పొరేటర్ అయిన ఆర్‌సి మునికృష్ణకు కట్టబెట్టాడు. దీంతో డిప్యూటీ మేయర్ పదవి భర్తీ అయింది. అయితే ఇక మేయర్ పదవిపై అన్న రామచంద్రయ్య ప్రత్యక్షంగా పరోక్షంగా టిడిపి కూటమినేతలతో మంతనాలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.ఇక్కడ ఆయనకు ఒక పెద్ద చిక్కు వచ్చి పడింది. ఏమిటంటే తన కుమార్తెలైన డాక్టర్ సంధ్య యాదవ్,అనిత యాదవులలో ఇద్దరిలో ఎవరికైనా అంతేకాకుండా తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని మెజారిటీ కార్పొరేటర్‌తో పాటు మొత్తం యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు,యువత మహిళలు,యాదవ కుటుంబాలు కూడా డాక్టర్ అన్న సంధ్య యాదవ్ కు మేయర్ పదవి ఇస్తే బాగుంటుందని గుసగుసలాడుతున్నారు. అంతేకాకుండా డాక్టర్ సంధ్య యాదవ్ అయితే ఇటు టిడిపి పార్టీకి అటు కూటమి నేతలను ఏకత్రాటిపై నడిపే శక్తి యుక్తి ఉన్న ఏకైక వ్యక్తి డాక్టర్ అన్న సంధ్య యాదవ్ అని అందరి నోట గట్టిగా వినిపిస్తున్న నేపథ్యం.అయితే పార్టీలో ఇప్పటి వరకు చేరకుండా పార్టీ కార్యక్రమాలకు అక్కడక్కడ పాల్గొంటున్న అన్న అనిత యాదవ్ కు మేయర్ పదవి వరిస్తుందా..? లేకుంటే టిడిపి కూటమిపార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న అన్న డాక్టర్ సంధ్య యాదవ్‌కు మేయర్ పదవి వరించనుందా..? కొద్ది రోజుల్లో తేలనుంది.

అయితే మొత్తం మీద ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్ బాబు అనిత, పెద్దల ఆశీస్సులు టిడిపి కూటమి పార్టీలతో పాటు తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని మొత్తం యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు యువత మహిళలు డాక్టర్ అన్న సంధ్య యాదవ్ కే మేయర్ పదవి ఇస్తే బాగుంటుందని ఆమె వైపు మొగ్గుచూపడం, ప్రస్తుతం డాక్టర్ శిరీష కు దీటుగా డాక్టర్ అన్నా సంధ్య యాదవ్ పాలనలో తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని తిరుపతి నియోజకవర్గ ప్రజలు జిల్లా ప్రజలు యువత మహిళలు టిడిపి కూటమి ప్రధానంగా యాదవ సామాజిక వర్గ ప్రజలు గుసగుసలాడడం కొసమెరుపు. మేయర్ పదవి ఇప్పించాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే గత వైసిపి ప్రభుత్వం లోని పార్టీ నుండి తాను విడిపోయి తటస్థంగా ఉంటూ టిటిపి కూటమి గెలుపుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ టిడిపి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వస్తున్నాడు. తమ పెద్ద కుమార్తె అయిన అన్న డాక్టర్ సంధ్య యాదవ్ మాత్రం సాక్షాత్తు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు సమక్షంలో టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకుంది.

## నేడు కొడంగల్ లో కేటీఆర్ రైతు నిరసన దీక్ష





### కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

**మద్దూర్, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** కోస్గి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు నిరసన దీక్షకు రైతులు కార్యకర్తలు భారీగా తరలిరావాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మద్దూరు మండల కేంద్రంలో ఆదివారం రోజు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం కోస్గి పట్టణ కేంద్రానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు నిరసన దీక్ష సభకు వస్తున్నారని అన్నారు. ఉమ్మడి మద్దూర్ మండలం నుంచి భారీగా రైతులు తరలి రావాలని కార్యకర్తల సమావేశంలో ఆయన రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని పల్లె గడ్డ తండాకు చెందిన పదిమంది యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వంచర్ల గోపాల్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి సలీం, విజయభాస్కర్ రెడ్డి, నెల్లి రాములు, బసప్ప, మండల బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి మధిర రైల్వే స్టేషన్

**మధిర, ఫిబ్రవరి 9(నిఘా న్యూస్):** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొనసాగిన మధిర రైల్వే స్టేషన్ ఇకనుండి దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి వెళ్లనుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించిన డీపీఆర్లు సిద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వం,రైల్వే బోర్డును ఆదేశించింది.ఈ ఆదేశాలతో విజయవాడ సమీపంలోని కొండపల్లి నుండి తెలంగాణ రాష్ట్రం పరిధిలోని బోనకల్ మండలం మోటమర్రి వరకు 64 కిలోమీటర్ల పరిధిలో ఉన్న రైల్వేస్టేషన్లు మొత్తం కొత్తగా ఏర్పాటు చేయబోయే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి వెళ్లనున్నాయి.దీంతో ఖమ్మం జిల్లాలో ఖమ్మం తర్వాత అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా ఉన్న మధిర రైల్వే స్టేషన్ ఇకనుండి దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి వెళ్లనుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉన్నప్పుడు ఉద్యోగ అవసరాల దృష్ట్యా రైల్వే ఉద్యోగులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు 294కిలోమీటర్ల దూరంలో ఉన్న సికింద్రాబాద్ వెళ్లేవారు. ఇప్పుడు మధిర ప్రాంత ప్రజలు, ప్రజా ప్రతినిధులు రైల్వే ఉద్యోగులు, రైల్వే పనులు కోసం 54కిలోమీటర్ల సమీపంలోని విజయవాడలోనే డీఆర్ఎం కార్యాలయానికి వెళ్ళవలసి ఉంటుందని రైల్వే




ఉన్నతాధికారులు తెలిపారు. గతంలో దెందుకూరు,తొండలగోపారం, ఎర్రుపాలెం, రేమిడిచర్ల స్టేషన్ పరిధిలో పనిచేసే రైల్వే ఉద్యోగులు కొండపల్లి సెక్షన్ లో కొనసాగేవారు. మోటమర్రి నుంచి కొండపల్లి వరకు పనిచేస్తున్న రైల్వే ఉద్యోగులందరూ దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి వెళ్ళవలసి ఉంటుంది.

## కార్యకర్తలూ అధికారాన్ని అనుభవించాలి

**ఖమ్మం, ఫిబ్రవరి 9(నిఘా న్యూస్):** ఖమ్మం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో నగర మేయర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, గిడ్డంగుల సంస్థ చైర్మన్,కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లాఠీ దెబ్బలకు భయపడకుండా కాంగ్రెస్ కోసం కార్యకర్తలు పనిచేశారు. కార్యకర్తలు కూడా అధికారాన్ని అనుభవించాలని అన్నారు. గౌరవంగా తలెత్తుకుని ఉండే





విధంగా పనిచేయాలి ప్రతిపక్షానికి అవకాశం లేకుండా కృషి చేసి ఆ కుర్చీలో మనం కూర్చోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

### ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి..

పదవిని పిలిచి ఇచ్చే రోజులు వస్తాయని కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే టికెట్ రాని వాళ్ళు ఎంపీలు అయ్యారు. పార్టీని బ్రతికించుకోవాలని కార్యకర్తలకు మంత్రి తుమ్మల తెలిపారు. తల్లిని కూడా మోసం చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి.పార్టీకి ద్రోహం చేస్తే తల్లికి ద్రోహం చేసినట్లు గుర్తించాలన్నారు. తనను కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకుంది. నిబద్ధతగా పని చేస్తానని చెప్పారు. పార్టీ క్రమశిక్షణ గల వారికి ప్రాధాన్యత ఉంటుంది. అవకాశవాదులను నమ్మరాదని మంత్రి అన్నారు. అధికారాన్ని అస్థగతం చేసుకోవాలని కార్యకర్తలకు చెప్పారు.సీఎం శక్తికి మించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. దేశంలోనే రికార్డు స్థాయిలో ఏ రాష్ట్రంలో లేనటువంటి సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.మరోవైపు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మనకు కావలసిన నిధులు ఇవ్వడం లేదు. నీటిపారుదల ఇరిగేషన్ రోడ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల పాజిటివ్‌గా లేదని తెలిపారు. గుండె ధైర్యంతోని సొంత కాళ్ళ మీద నిలబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోరికలు తీరుస్తున్నారని అన్నారు. కార్యకర్తలు అడిగిన ప్రతి పని బాకీ లేకుండా పూర్తి చేస్తానని చెప్పారు. ఖమ్మం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1400 కోట్లు ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## వైభవంగా గరిగుట్ట పెద్దమ్మ జాతర

### అమ్మవారిని దర్శించుకున్న కెఎల్ఆర్ కుటుంబ సభ్యులు



**మహేశ్వరం, ఫిబ్రవరి 9(నిఘా న్యూస్):** జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని మాదన్న గూడ అటవీ ప్రాంతంలో వెలిసిన ప్రసిద్ధమైన గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారిని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, జల్పల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్, చింతకింది నవీన్ గౌడ్ తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కే.ఎల్.ఆర్ మాట్లాడుతూ పెద్దమ్మ వారు దయతో, చల్లని చూపుతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండే విధంగా దీవించాలని కోరుకున్నారు.

## కాలనీ ప్రతినిధులకు పోలీసుల అవగాహన

### మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి



**మేడిపల్లి, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):** మేడిపల్లి పిఎస్ పరిధిలో అన్ని కాలనీల ప్రతినిధులతో ఆదివారం పిఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని ఇన్స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురికావద్దని, గుర్తు తెలియని వ్యక్తులు కాలనీలలో అనుమానస్పదంగా కనిపిస్తే సమాచారం అందించాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు ఇవ్వకూడదని అన్నారు. పోకిరీలు ఈవ్ టీజ్ చేసినట్లు కనిపించినా వెంటనే పోలీసు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిద కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు, వేదపండితులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. దర్శన అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో స్వామి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

- శ్రీశైలం, ఫిబ్రవరి 9 (నిఘా న్యూస్):



Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com